క్లుప్తంగా

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం



బొద్దాంలో శ్రీరామ పట్టాభిషేకంలో పాల్గొన్న భక్తులు

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామంలో శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. రుత్వికులు సీతారామచంద్రులకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం సీతారామ స్వామివారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఎస్‌కోట పట్టణంలో బ్రాహ్మణ వీధి కోదండ రామాలయంలో శ్రీరామ పట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు.

అయ్యప్ప ఏకశిలకు ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న బెల్లాన శ్రీదేవి, వంశీకృష్ణ, గురుస్వాములు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న హరిహరపుత్ర అయ్యప్ప ఆలయానికి గుంటూరు జిల్లా నుంచి తీసుకువచ్చిన ఏకశిల శుక్రవారం చీపురుపల్లి చేరుకుంది. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గురుస్వాములు, భక్తులు ఏకశిలకు ఘన స్వాగతం పలికారు. పూలతో అలంకరించి పూజలు చేశారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సతీమణి బెల్లాన శ్రీదేవి, కుమారుడు బెల్లాన వంశీకృష్ణ, కోడలు పావని, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఏకశిల ఊరేగింపులో నిర్వహించిన కోలాటం, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఎంపీకి ఫేకర్ కార్మికుల వినతి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న గరివిడి ఫేకర్ పరిశ్రమ కార్మిక సంఘ నాయకులు

చీపురుపల్లి: ఫేకర్ పరిశ్రమకు విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించి కార్మికులకు నిరంతరం పని కల్పించేలా చర్యలు చేపట్టాలని గరివిడి ఫేకర్ అల్లాయిస్ పరిశ్రమకు చెందిన వైఎస్సార్ ఎంప్లాయీస్ యూనియన్, సీఐటీయూ ఫేకర్ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కంపెనీలో 40 శాతం ఉత్పత్తి ఖర్చు విద్యుత్ చార్జీలు చెల్లింపులకే సరిపోతుందన్నారు. దీంతో ఫెర్రో పరిశ్రమలను నడపలేమని యాజమాన్యాలు చెబుతున్నాయని స్పష్టం చేశారు. గరివిడి ఫేకర్ పరిశ్రమలో 300 మంది శాశ్వత కార్మికులు, 400కు పైగా కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారని, విద్యుత్ చార్జీల కారణంగా అందరికీ నిరంతరం పని లభించనని పరిస్థితి నెలకొందన్నారు. యూనియన్ నాయకులు అంబల్ల గౌరునాయుడు, ఉత్తరావలి ప్రకాష్, విశ్వనాథరాజు, రామునాయుడు, బమ్మిడి అప్పలస్వామి, కంది రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

బొండపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రేషన్ వాహనాల ఆపరేటర్లు ఎంపీపీ చల్ల చలంనాయుడు, తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రాకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వాహనాలకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చెల్లిస్తుందని ముందుగా ప్రకటించి ఇప్పుడు ఎండీఎం ఆపరేటర్ల వేతనాల్లో కోత విధించడం తగదన్నారు. ఇన్సూరెన్స్‌ను ప్రభుత్వమే చెల్లించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ

చీపురుపల్లి రూరల్: మండలంలోని రావివలస పంచాయతీ పరిధి విజయరాంపురం గ్రామ యువతకు పట్టణానికి చెందిన ఆశయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ శుక్రవారం వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. వారిని ప్రోత్సహించేందుకే క్రీడా కిట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. క్రీడలు మానసిక ఉత్సాహాన్నిస్తాయన్నారు.

జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా వినోద్‌బాబు

చీపురుపల్లి: పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎం.వినోద్ బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అప్పర్ సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన ఆయన కొద్ది రోజులు ఇంటర్మీడియట్ బోర్డుకు బదిలీపై వెళ్లారు. అక్కడి నుంచి బదిలీపై చీపురుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వచ్చారు. ఇంతవరకు ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా ఉన్న సతీష్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. కళాశాల అధ్యాపక సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు.

జగనన్నే రాష్ట్ర భవిష్యత్



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- 'జగనన్న నువ్వే మా భవిష్యత్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: 'జగనన్న నువ్వే మా భవిష్యత్' అనే కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకువెళ్లి విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్మన్‌తో పాటు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. ఏప్రిల్ 1 నుంచి 5 వరకు సచివాలయ కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు అంతా ప్రతీ సచివాలయానికి వెళ్లేలా షెడ్యూల్ చేసుకోవాలని సూచించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి బొమ్మతో ఉన్న స్టిక్కర్లు, బ్యాడ్జీలు, కరపత్రాలు ప్రతీ ఇంటికి చేరవేయాలన్నారు. ఎన్నికలకు మరో ఏడాది మాత్రమే ఉన్నందున పార్టీ శ్రేణులంతా చురుగ్గా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా రాష్ట్రంలో అవినీతిరహిత పాలన అందిస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరవేశారన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తలెత్తుకునే విధంగా చేశారన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్వీ రమణరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు కేవీ సూర్యనారాయణరాజు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, బెల్లాన వంశీకృష్ణ, మీసాల విశ్వేశ్వర రావు, తాడ్డి వేణు, బూర్లె నరేష్, పొట్నూరు సన్యాసప్పలనాయుడు, శీర అప్పలనాయుడు, నాలుగు మండలాల సచివాలయ కన్వీనర్లు సువ్వాడ అప్పలనాయుడు, పొన్నాడ కుమార్, ప్రసాద్, బెల్లాన బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల ఆరోపణలు తిప్పికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే మన భవిష్యత్, మన తర్వాత తరాల భవిష్యత్ ముడిపడి ఉందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావు అన్నారు. స్థానిక ఆర్.కె.ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సాయంత్రం 'జగనన్నే మా భవిష్యత్' ప్రచార కార్యక్రమంపై నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 14 వరకు పార్టీ కార్యకర్తలు, గృహసారథులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వ పాలనకు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు ఉన్న తేడాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించాలని సూచించారు. ప్రతిపక్షాల ఆరోపణలు, ఎల్లో మీడియాలో వస్తున్న ప్రభుత్వ వ్యతిరేక కథనాలను తిప్పికొట్టాలన్నారు. మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి మాట్లాడుతూ జగనన్నతోనే రాష్ట్రంలో విద్యార్థులు, మహిళలు, యువతకు భవిష్యత్ అన్న అంశాలను కచ్చితమైన కార్యాచరణతో ప్రతీ గడపకూ తీసుకెళ్లాలన్నారు. రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నాయుడుబాబు మాట్లాడుతూ తెదేపా అధికారం అందుకోవటం కల అని, బలమైన క్యాడర్ వైఎస్సార్‌సీపీ స్వంతమని అన్నారు. ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ మనం కష్టపడి పార్టీని గెలిపించాం. పార్టీ వల్ల మనందరికీ గౌరవం పెరిగిందన్నారు. 2024లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాకుంటే మన తర్వాత తరాల భవిష్యత్ ప్రశ్నార్థకం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు ఎంపీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం గ్రామ సచివాలయంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఐసీడీఎస్ రీజనల్ జోనల్ డైరెక్టర్ చిన్మయిదేవి, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి పాల్గొని చిరుధాన్యాల ఆవశ్యకతను వివరించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు సకాలంలో అందజేయాలని సూచించారు. అనంతరం చిరుధాన్యాలతో కార్యకర్తలు తయారు చేసిన వంటల ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో సీడీపీఓ నాగమణి, సర్పంచ్ గొటివాడ దాసు, ఎంపీటీసీ కన్నయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు రేణుక, వాణి తదితరులు పాల్గొన్నారు.



పోషణ పక్వాడా కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌జేడీ చిన్మయిదేవి, జెడ్పీటీసీ రాజేశ్వరి

శివాలయం నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న బొత్స ఝాన్సీలక్ష్మి

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలం తోండ్రంగి గ్రామంలో కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయశాఖ నుంచి ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలు చొప్పున నిధులు కేటాయిస్తోందని అన్నారు. దేవాలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక భావాలు పెరుగుతాయని, సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొంటుందన్నారు. ఆలయ నిర్మాణంలో గ్రామస్తులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, స్థానిక సర్పంచ్ పిల్ల బంగారు లక్ష్మి, అప్పలనాయుడు, జమ్ము సతీష్, బలగం శ్రీను తదితరులు పాల్గొన్నారు.


కొత్తవలస న్యాయవాదుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం



నూతన కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు

కొత్తవలస: మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాదుల సంఘం ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా కె.మహేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా ఎస్.శ్రీరామ్మూర్తి(జూనియర్), ప్రధాన కార్యదర్శిగా ఎంపీఎస్ గిరిబాబు, సహాయ కార్యదర్శిగా ఎస్.సత్యనారయణ, ట్రెజరర్‌గా జి.వి.రమణ, జాయిన్ ట్రెజరర్‌గా జి.కృష్ణ, సంఘ కార్యవర్గ సభ్యులుగా జీపీ లత, మళ్ల రాము, ఆర్.కృష్ణంనాయుడు, వి.రాజేష్, సీహెచ్ సతీష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని న్యాయమూర్తి సూర్యకిరణ్‌శ్రీ, న్యాయవాదులు జి.మహేంద్ర, సీహెచ్‌ఆర్ ప్రసాద్, గాలి ఈశ్వరరావు, ఎన్.శ్రీరామ్మూర్తి, తదితరులు అభినందించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బిట్రా



సూర్యారావుకు నియామక పత్రం అందచేస్తున్న ఎన్నికల పరిశీలకుడు శ్రీనివాసులునాయుడు

గజపతినగరం, బొండపల్లి: స్థానిక ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టు బార్‌అసోసియేషన్ అధ్యక్షుడిగా బిట్రా సూర్యారావు ఎన్నికయ్యారు. కోర్టు ఆవరణంలో శుక్రవారం బార్‌అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా పోలిపల్లి ఆదినారాయణ, కార్యదర్శిగా తొత్తడి దేవుడుబాబు, కోశాధికారిగా లెంక రాంబాబు, సహాయ కార్యదర్శిగా నాలాం రామ్‌ప్రసాద్‌తో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసులునాయుడు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

కొత్తవలస: అరకు–విశాఖ అంతర్ రాష్ట్ర రహదారిలో అడ్డూరువానిపాలెం సమీపంలో గల కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాల వద్ద ఆగి ఉన్న లారీని మరో లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. గురువారం రాత్రి జరిగిన ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎస్.కోట నుంచి కొత్తవలస వస్తున్న లారీని రోడ్డు పక్కన డ్రైవర్ నిలిపాడు. అదే సమయంలో వెనుక నుంచి మితిమీరిన వేగంతో వచ్చిన మరో లారీ ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టింది.దీంతో ఢీకొట్టిన లారీ ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. అయితే అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఈ రహదారిలో నిత్యం వేలాది లారీలు స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్, మా మహామాయ, జిందాల్ ఫెరో ఎల్లాయిస్ కార్మాగారాలకు మితిమీరిన వేగంతో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ సమయంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందోనని పలువురు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికైనా సంబంధిత అధికారులు లారీల వేగంపై దృష్టి సారించి జరగబోయే ప్రమాదాలను అరికట్టాలని కోరతున్నారు.

ప్రభుత్వ సంక్షేమాన్ని ప్రజలకు తెలియజేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: గ్రామాల్లోని పార్టీ కార్యకర్తలంతా సమష్టిగా పనిచేసి 'జగనన్నే మా భవిష్యత్' ప్రచార కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నియోజకవర్గ స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గజపతినగరం నియోజకవర్గంలో ఏప్రిల్ 1 నుంచి ఇంటింటా ప్రచార కార్యక్రమాలను చేపట్టాలన్నారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లు కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. ఇంటింటికీ వెళ్లి పార్టీ ముంద్రించిన కరపత్రాలు, పుస్తకాలను పంపిణీ చేయాలన్నారు. వారికి ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, జేఏసీ కన్వీనర్లు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు నారాయణమూర్తిరాజు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, జేఏసీ కన్వీనర్ కె.సుబ్రహ్మణ్యం, గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి జెడ్పీటీసీలు గార తవుడు, రౌతు రాజేశ్వరి, రాపాక సూర్యప్రకాష్, దత్తిరాజేరు, బొండపల్లి ఎంపీపీలు గేదెల సింహాద్రి అప్పలనాయుడు, చల్లా చల్లంనాయుడు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, కడుబండి రమేష్ నాయుడు, ఈదుబిల్లి కృష్ణ, గొర్లె రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే 'గడపగడపకు'



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

- ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

దత్తిరాజేరు: నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా అందించిన లబ్ధిని వివరించడంతో పాటు ప్రజా సమస్యలను తెలుసుకునేందుకే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. కోమటిపల్లి గ్రామంలో సర్పంచ్ రొంగలి రాములమ్మ, వెంకన్న ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అర్హులకు సంక్షేమ పథకాలు అందేవి కావని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలను అర్హుల ఇంటి వద్దకే చేరవేస్తున్నారన్నారు. రైతులకు గ్రామస్థాయిలోనే వ్యవసాయశాఖ సేవలను ఆర్‌బీకేల ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మంచినీటి బావికి, బంగారమ్మ ఆలయానికి వెళ్లేందుకు రోడ్డు నిర్మించాలని స్థానిక మహిళలు ఎమ్మెల్యేను కోరాగా.. ఎంపీ నిధులతో రోడ్డు వేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, ఎంపీటీసీ మంత్రి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ మండల శ్రీను, మాజీ సర్పంచ్‌లు సరిత అప్పలనాయుడు, శీర అప్పన్న, న్యాయవాది కలిశెట్టి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి సహకరించాలి

కొత్తవలస: పంచాయతీ అభివృద్ధికి సభ్యులు సహకరించాలని కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రారామస్వామి కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈఓ కన్నబాబు ఆధ్వర్యంలో శుక్రవారం పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైలీ మార్కెట్ ఆశీలు వసూలు, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ, పాతపేపర్ల అమ్మకం, పారిశుద్ధ్యం, ప్లంబింగ్, విద్యుత్, శ్మశానవాటిక ప్రహరీకి ఆనుకొని షాపుల నిర్మాణం తదితర 13 అంశాలపై చర్చించి తీర్మానం చేశారు. సర్వే నంబర్ 81–2లో పంచాయతీకి చెందిన ఎకరా 26 సెంట్లు భూమిని కొంతమంది ఆక్రమణ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని సభ దృష్టికి తీసుకురాగా.. పంచాయతీ స్థలాన్ని పరిరక్షిస్తామని సర్పంచ్ అన్నారు. సమావేశంలో ఉప సర్పంచ్ పెనగండి మంగవేణి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న సర్పంచ్ ఎర్రారామస్వామి

నవధాన్యాల సాగుతో పంటకు మేలు

కొత్తవలస: నవధాన్యాల సాగుతో భూమి సారవంతం అవుతుందని, పంటకు కావాల్సిన పోషకాలు లభిస్తాయని జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు విరోతి కొండలరావు అన్నారు. ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాల సాగుపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో నవధాన్యాలయ సాగుపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు.
వేపాడ: నవధాన్యాల సాగు రైతులకు లాభదాయకమని ఏపీ నార్త్‌కోస్టల్ జోనల్ ఆఫీసర్ ప్రకాశ్ అన్నారు. గుడివాడ గ్రామంలో నవధాన్యాల సాగు, కిచెన్‌గార్డెన్లపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. కిచెన్ గార్డెన్‌లో కుటుంబానికి కావాల్సిన కాయకూరలను పండించుకోవచ్చన్నారు.

నేడు 'వైఎస్సార్ ఆసరా' సంబరాలు

బొండపల్లి: మండల కేంద్రమైన బొండపల్లిలో మండల సముదాయాలకు ఆనుకొని ఉన్న భువి లేఅవుట్‌లో శనివారం ఉదయం 9గంటలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ చల్ల చలంనాయుడు తెలిపారు. కార్యక్రమం ఏర్పాట్లను శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యతో పాటు జిల్లా డీఆర్‌డీఏ అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల లబ్ధిదారులంతా హాజరుకావాలని కోరారు. ఎంపీపీతో పాటు ఎంపీడీఓ ఎ.వేదవతి, వెలుగు ఏపీఎం కె.సులోచనాదేవి, ఈఓపీఆర్డీ సుగుణాకరరావు, సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు ఉన్నారు.

సృజనాత్మక పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ఆంధ్రాయూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ సుమన్

చీపురుపల్లి రూరల్(గరివిడి): శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేసుకుని కొత్త ఆవిష్కరణల దిశగా ఇంజినీరింగ్ విద్యార్థులు ఆలోచనలకు పదును పెట్టాలని ఆంధ్రాయూనివర్సిటీ మెకానికల్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. కేఏఎస్ సుమన్ సూచించారు. గరివిడి సెయింట్ థెరీస్సా ఇంజినీరింగు కళాశాలలో ప్రిన్సిపల్ డా.వి.జాషువా జయప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన అఖీ 2023 జాతీయస్థాయి సాంకేతిక ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న అంతర్గత నైపుణ్యాలను, సాంకేతిక నైపుణ్యాలను, నాయకత్వ లక్షణాలను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. జీఎంఆర్ఐటీ ప్రొఫెసర్ డా.పి.రమణ మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక, అంకిత భావం, క్రమశిక్షణతో అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

బంగారమ్మకు ప్రత్యేక పూజలు

బొండపల్లి: మండల కేంద్రమైన బొండపల్లిలో కొలువైన బంగారమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణంలో భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

భవిత కేంద్రాల్లో స్పీచ్‌థెరపీ

గజపతినగరం: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో చెవిటి, మూగ విద్యార్థులకు అందిస్తున్న స్పీచ్ థెరపీతో వారిలో మెరుగైన ఫలితాలు వస్తున్నాయని ఐఈఆర్‌టీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం స్పీచ్‌థెరపీ సేవలందించారు. వినికిడిలోపంతో బాధపడుతున్న చిన్నారులకు ఆడియో మీటర్ టెస్ట్ నిర్వహించారు. గజపతినగరంతో పాటు ఎం.కొత్తవలస, లింగాలవలస, పురిటిపెంట, మదుపాడ తదితర గ్రామాల నుంచి వచ్చిన దివ్యాంగ చిన్నారులు స్పీచ్‌థెరపీతో పాటు ప్రతీ సోమవారం ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన

బొండపల్లి: గ్రామాల్లో నిర్మించిన చెత్తసంపద కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పంచాయతీ ఆదాయాన్ని మెరుగుర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎ.వేదవతి అన్నారు. మండలంలోని అంబటివలస గ్రామంలోని చెత్త సంపద కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. గ్రామాల్లో చెత్త సేకరణ, వర్మీకంపోస్ట తయారీ, విక్రయంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఈఓపీఆర్డీ సుగుణకరరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన

మెరకముడిదాం: మండలంలోని ఎం.గదబవలస గ్రామంలో నెల్లిమర్ల మిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. మిమ్స్ వైద్యాధికారులు చంద్రకళ, యోగితావర్మ, వైజేఎం సాయి, శరత్, శ్రీనివాసరావు తదితరులు శిబిరంలో సేవలందించారు. సుమారు 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. 11 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

మెరకముడిదాం: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు రాసిన విద్యార్థులకు వేసవిలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సోమలింగపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ పిల్లా శ్రీనివాసరావు తెలిపారు. బెటర్‌మెంట్, సప్లిమెంట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమలింగపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తరగతులు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

6న వారపుసంత ఆశీలు వేలం

కొత్తవలస: మండల కేంద్రంలోని వారపుసంతలో 2023–24 సంవత్సరానికి గాను ఆశీలు వసూలుకు ఏప్రిల్ 6న ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ ధర్మారావు శుక్రవారం ఒక ప్రకటణలో తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకున్నవారు ముందుగా రూ.50 వేలు ధరావత్తును ఒక రోజు ముందుగా ముఖ్యకార్యనిర్వహణ అధికారి, జిల్లా పరిషత్ విజయనగరం వారి పేరున ఏదైనా జాతీయ బ్యాంకులో చెల్లే విధంగా తీసిన డీడీని పాట సమయంలో సమర్పించాల్సి ఉంటుందన్నారు.

30 మద్యం బాటిళ్లు స్వాధీనం

దత్తిరాజేరు: మండలంలోని రామచంద్రాపురం వైన్ షాపు నుంచి అక్రమంగా తరలిస్తున్న 30 మద్యం బాటిళ్లను పోలీసులు పట్టుకున్నారు. విజయరాంపురం వద్ద అదే గ్రామానికి చెందిన ఎస్.తాడు మద్యం సీసాలు తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు భూర్జవలస ఎస్సై రాజేష్ శుక్రవారం తెలిపారు.

పెదమానాపురం ఎస్సై బదిలీ

దత్తిరాజేరు: మండలంలోని పెమానాపురం పోలీస్ స్టేషన్ ఎస్సై బి.భాగ్యం బొబ్బిలి స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో గుర్ల ఎస్సై శిరీష ఇక్కడకు రానున్నారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజలకు ఎస్సై భాగ్యం ధన్యవాదాలు తెలియజేశారు.

గ్రౌండ్ ట్రూతింగ్ సర్వే పరిశీలన

చీపురుపల్లి రూరల్: మండలంలోని మెట్టపల్లి గ్రామంలో జరుగుతున్న గ్రౌండ్ ట్రూతింగ్ సర్వే పనులను తహసీల్దార్ ఎం.సురేష్ శుక్రవారం పరిశీలించారు. సర్వేను సకాలంలో పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూసర్వేకు రైతులు సహకరించాలని కోరారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు చందక గురునాయుడు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే ఉపాధి పనులు చేపట్టాలి

కొత్తవలస: ఉపాధిహామీ పథకం పనులను పాతపద్ధతిలోనే నిర్వహించాలని వేతనదారులు కోరారు. ఈ మేరకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ ఉపాధి పనులను ఒక పూటే నిర్వహించాలని, వేతన దినాలను 200 రోజులు చేయాలని, కనీస వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పూర్తిస్థాయిలో బడ్జెట్‌ను కేటాయించాలని, వేసవిలో మజ్జిగకు ప్రత్యేక అలవెన్స్ మంజూరు చేయాలని కోరారు.